ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు

సోమవారం 27 అక్టోబరు 2025



కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని నాయన్‌హాళ్లి, జిగనల్ పోస్టుకు చెందిన అర్గా బందోపాధ్యాయ కుటుంబ సభ్యుడి విషాద వదనం





ఆదిశేషగిరి రావు కుమార్తె, కుటుంబ సభ్యులు రోదన

శరవేగంగా..

- ఒక్కరోజుల్లోనే 19 మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు
- వెంటనే బంధువులకు మృతదేహాల అప్పగింత
- మృతదేహాలను సొంత ప్రాంతాలకు చేర్చిన ప్రభుత్వం
- కలెక్టర్, ఎస్పీల ప్రత్యేక పర్యవేక్షణ
- ఫోరెన్సిక్ వైద్యుల చొరవపై అభినందనలు



మార్చురీ హాల్ నుంచి మేఘనాథ్ మృతదేహాన్ని తరలిస్తున్న సిబ్బంది



మార్చురీ గది నుంచి మృతదేహం తరలింపు




మార్చురీ వద్ద ఎస్పీ విక్రాంత్, పోలీసులు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు ప్రమాద దుర్ఘటన తర్వాత కూటమి ప్రభుత్వం శరవేగంగా స్పందించింది. అసాధారణ స్థాయిలో డీఎన్ఏ పరీక్షలు చాలా వేగంగా పూర్తిచేసి మృతదేహాలను వారి బంధువులకు అప్పగించింది. బస్సు దహనం అయిన తర్వాత 19 మంది సజీవ దహనం కావడం, అందులో మృతదేహాలు మాంసపు ముద్దలుగా మారాయి. ఈ నేపథ్యంలో ప్రమాద స్థలంలోనే తాత్కాలిక మార్చురీ ఏర్పాటుచేశారు. ఫోరెన్సిక్ విభాగపు హెచ్‌వోడీ డా.సాయి సుధీర్, సీనియర్ ప్రొఫెసర్ డా.బ్రహ్మాజీ మాస్టర్‌తో పాటు 14 మంది వైద్యులు, పీజీ బృందం మృతదేహాల నుంచి డీఎన్ఏ శాంపిల్స్ సేకరించారు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా మంగళగిరిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు పంపించారు. శనివారం బంధువుల దగ్గర డీఎన్ఏ శాంపిల్స్‌ను పళ్లు, ఎముక, కండరాల నుంచి సేకరించి ల్యాబ్‌కు పంపించారు. శనివారం ఉదయం 10 గంటలకు మంగళగిరికి శాంపిల్స్‌లు చేరగా ఆదివారం ఉదయం 7గంటలకే నివేదికలు ఫ్యాక్స్‌లో చేరారు. 19మంది మృతుల్లో 18 మంది పేర్లు మాత్రమే గుర్తించడంతో వారి బంధువులకు సమాచారమిచ్చి కర్నూలుకు రప్పించారు. హైదరాబాదులో తమ బంధువు రిజర్వేషన్ లేకుండా కావేరి బస్సులో రిజర్వేషన్ లేకుండా ఎక్కిన ప్రయాణికుడు ఆచూకీ, అప్పగింత కష్టంగా మారడంతో చిత్తూరు జిల్లా యమగనిపల్లెకు చెందిన త్రిమూర్తులుగా అతని మృతదేహాన్ని అప్పగించాలని బంధువులు కోరారు. త్రిమూర్తులు హైదరాబాదులోని ఇంటికి చేరకపోవడంతో పోలీసులు 19వ మృతదేహం త్రిమూర్తులదే అన్న అనుమానంతో ఆదివారం ఉదయం మంగళగిరిలో ఫోరెన్సిక్ సైన్స్‌ల్యాబ్‌కు శాంపిల్స్‌ను పంపి సాయంత్రం 6గంటల లోపు డీఎన్ఏ రిపోర్టులు రావడం 19వ మృతదేహం త్రిమూర్తులదేనని నిర్ధారించారు. బంధువులకు అప్పగించారు.

మిగతా 7వ పేజీలో



మధ్యాహ్నం 1:45 : గొల్ల రమేశ్, భార్య అనుషా, పిల్లలు మాన్విత, శశాంక్‌ల మృతదేహాల తరలింపు



మధ్యాహ్నం 1:50 : యువన్ శంకర్‌రాజు మృతదేహం తరలింపు



మధ్యాహ్నం 1:55
ఆదిశేషగిరి రావు..



మధ్యాహ్నం 2:00
గన్నమనేని ధాత్రి



మధ్యాహ్నం 2:10
అమ్రిత కుమార్



మధ్యాహ్నం 2:30
బందోపాధ్యాయ



మధ్యాహ్నం 4:20
మేఘనాథ్



మధ్యాహ్నం 5:30
మంగ సంధ్య, చందన



మధ్యాహ్నం 5:50
అనూష

జీడీపీకి కొనసాగుతున్న వరద

- 4వ గేటు నుంచి 1,630 క్యూసెక్కుల నీరు విడుదల



గాజులదిన్నె ప్రాజెక్టు నీటిని హంద్రీకి విడుదల చేస్తున్న దృశ్యం

గోనెగండ్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జీడీపీలో వరద కొనసాగుతోంది. ఆదివారం 4వ గేటు నుంచి 1,630 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు జీడీపీ ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. శనివారం 4, 5, గేట్ల ద్వారా నీటి విడుదల చేసిన అధికారులు రాత్రి ఐదో గేటు మూసివేశారు. 4వ గేటు ద్వారా మాత్రమే నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 4టీఎంసీల వరద చేరింది. ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 4.5 టీఎంసీలు. నీటి మట్టాన్ని బట్టి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దిగువకు నీటిని వదులుతున్నట్లు ఏఈ తెలిపారు. మద్దికెర, దేవకొండ, పత్తికొండ, ఆస్పరి, తుగ్గలి ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో జీడీపీకి వరద వస్తోంది. మొంథా తుఫాన్‌ను దృష్టిలో పెట్టుకొని అధికారులు నీటి విడుదల చేపట్టారు.

ఆర్డీఎస్‌కు వరద పోటెత్తింది



అగసనూరు సమీపంలో తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీఎస్ ఆనకట్టపై దిగువకు పారుతున్న వరద

కోసిగి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణితో కురుస్తున్న వర్షాలకు మండలంలోని అగసనూరు గ్రామ సమీపంలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద పోటెత్తింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కర్ణాటక రాష్ట్రంతో పాటు ఏపీలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. వర్షాలకు వరద నీరు పోటెత్తడంతో ఆర్డీఎస్ ఆనకట్ట మీద నుంచి దిగువకు నీరు పారుతోంది. మరో రెండు రోజులు ఆర్డీఎస్ ఆనకట్టకు భారీగా వరద నీరు పోటెత్తే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రజలను అప్రమత్తం చేశారు. నదితీర ప్రాంతంలో చేతికొచ్చిన పైర్లు నీటి మునిగి రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి.

మార్కింగ్ త్వరగా పూర్తి చేయండి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): భూకమతాల వర్గీకరణ మార్కింగ్ ప్రక్రియను ఈనెల 29వ తేదీలోపు పూర్తిచేయాలని కలెక్టర్ ఏ.సిరి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఆదివారం మండల, డివిజన్ వ్యవ సాయ శాఖ అధికారులతో భూకమతాల వర్గీకరణ, ఈ పంట నమోదు, పత్తి, ఉల్లి పంటల హార్వెస్టింగ్‌పై కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 9,94,879 ఖాతాలకు సంబంధించి మార్కింగ్ చేయాల్సి ఉం దన్నారు. ఈపంట నమోదు త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లకు ముగిసిన టెండర్లు

- మైనింగ్ డీడీ వరప్రసాద్

నందవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదీతీర గ్రామాలైన నాగలదిన్నె- గంగవరం, జోహరాపురం ఇసుక రీచ్‌లకు టెండర్ల ప్రక్రియ ఆదివారం ముగిసినట్లు మైనింగ్ శాఖ డీడీ వరప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ నాగలదిన్నె దగ్గర 80,500 టన్నులు ఇసుక ఉందని, గంగవరం జోహరాపురం గ్రామాల మధ్య 1.28లక్షల టన్నుల ఇసుక ఉందన్నారు. లోడింగ్‌కు ప్రభుత్వ టెండర్ ధర రూ.45 పలుకుతుంది. టెండర్‌కు వచ్చిన వారు రూ 10 వేల అప్లికేషన్ ధర నిర్ణయించారు. నాగలదిన్నె రీచ్‌కు రూ.3.62లక్షలు, గంగవరం, జోహరాపురం గ్రామాల మధ్య రీచ్‌కు రూ.5.65లక్షలు ఈఎండీ కట్టాలన్నారు. ఒకవేళ టెండర్లు వేసిన టెండర్‌దారుడికి రీచ్ తగలకపోయిన డబ్బులు రిటర్న్ ఇస్తారన్నారు. ప్రభుత్వ పాట రూ.45 కాగా అంతకంటే తక్కువ రేటుకు కోడ్ చేసిన వారు వేలం పాట దక్కించకుంటారన్నారు. నాగులదిన్నె రీచ్‌కు కొందరు రూ.22కు, రూ.13.99కి కోడ్ చేశారు. అబ్దుల్ హమీద్ అనే వ్యక్తి రూ.6కు కోడ్ చేసి టెండర్ దక్కించుకున్నారు. గంగవరం జోహరాపురం రీచ్‌ను కూడా 90పైసలకు అబ్దుల్ హమీద్ దక్కించుకున్నారు. అంత తక్కువకు పాడిన హమీద్ రీచ్‌లను ఎలా కొనసాగిస్తాడో అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

కౌలు రైతులకు తీపి కబురు

- ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీకి కీలక నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలో 67వేల మందికి ప్రయోజనం





కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి దాకా వ్యవసాయమే ఆధారంగా కుటుంబ జీవనాన్ని కొనసాగిస్తున్న కౌలు రైతులు అష్టకష్టాలకు గురవుతున్నారు. వీరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు ఏవీ అందుకునే అవకాశం లేకుండా పోవడంతో అప్పుల ఊబిలో కూరుకుని పోయి కుటుంబాన్ని పోషించుకోలేకపోతున్నారు. ఈ పరిస్థితుల నుంచి కౌలు రైతులను గట్టెక్కించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు భూములున్న రైతులకు అందిస్తున్న ప్రత్యేక గుర్తింపు సంఖ్య కార్డును ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో కౌలు రైతులకు దేశంలోనే మొదటిసారిగా ఏపీ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అందే అవకాశం ఏర్పడనుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 60వేల మంది కౌలు రైతులు ఉన్నారు. వీరికి పంటలు సాగు చేసుకునేందుకు బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం అందడం లేదు. ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో రూ.100 కోట్ల దాకా పంట రుణాలు కౌలు రైతులకు అందించాలని లక్ష్యం పెట్టుకోవడం తప్పితే.. జిల్లా అధికార యంత్రాంగం ఈ లక్ష్యాన్ని ఏ మాత్రం నెరవేర్చలేకపోతుంది. రాజకీయ నాయకుల సిఫారసుల మేరకు కేవలం రూ.5 నుంచి 10 కోట్లు మాత్రమే రైతులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, ఇతర ప్రయోజనాలు, భూములున్న రైతులకు తప్ప కౌలు రైతులకు అందించడం లేదు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కౌలు రైతులకు కూడా భూములున్న రైతులతో పాటు పొలాలను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్న రైతులకు అన్ని ప్రయోజనాలు అందించాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వారం క్రితం వ్యవసాయ శాఖ ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, అగ్రిస్టాక్ కేంద్ర అధికారి రాజీవ్ చావ్లా, కేంద్ర సాంకేతిక సలహాదారు సమర్థరామ్, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, వ్యవసాయ ఉద్యాన శాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ, కే.శ్రీనివాసులు ముఖ్య అధికారులు, జిల్లా జాయింట్ డైరెక్టర్లతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కౌలు రైతు రిజిస్ట్రీకి సంబంధించిన ముఖ్యమైన వివరాలను చర్చించారు. దేశంలోనే తొలిసారిగా ఏపీలో కౌలు రైతులకు సంక్షేమ పథకాలు అందించే విధానాలు రూపొందించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. సీసీఆర్‌సీ కార్డులు ఉన్న రైతులకు కూడా కేంద్రం జారీ చేసిన విశిష్ట సంఖ్య కార్డులను అందజేయడం జరుగుతుందని అందువల్ల కౌలు రైతులు వెంటనే ఈక్రాప్ బుకింగ్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కొత్త విధానం వల్ల జిల్లాలోని 60 మంది కౌలు రైతులు సొంత భూములున్న రైతులతో సమానంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందగలుగుతారు. ఇది కౌలు రైతులకు ఎంతో మేలు చేస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. ఈపంటలో నమోదు చేసుకోవడం వల్ల కౌలు రైతుల వివరాలు ప్రభుత్వానికి అందుబాటులోకి వస్తాయి.

త్వరలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూములున్న రైతులకు ప్రత్యేక సంఖ్య గుర్తింపు కార్డులు కౌలు రైతులకు ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి విధి విధానాలు రాలేదు. ఈ విధానం అమలు అయితే కౌలు రైతులకు ప్రభుత్వ ప్రయోజనాలన్నీ అందుతాయి. బ్యాంకుల నుంచి రుణాలు కూడా తీసుకోవడం జరుగుతుంది.

-వరలక్ష్మి, జేడీ, కర్నూలు

వరికి వరద పోటు

- ఎడతెరిపిలేని వానలు
- ఈదురుగాలులతో నేలవాలిన పైరు
- అన్నదాతకు అపార నష్టం



తుమ్మిగనూరులో నేలకొరిగిన వరి పైరు

కోసిగి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేని వానలు కురిస్తున్నాయి. చేతికొచ్చిన వరి పంట వందల ఎకరాల్లో నీట మునిగి రైతులకు అపార నష్టం వాటిల్లింది. మండల పరిధిలోని తుమ్మిగనూరు, సాతనూరు, కందుకూరు, కడిదొడ్డి గ్రామాల్లో చేతికొచ్చిన వరి కంకులు ఈదురు గాలులకు నేలవాలాయి. కోతకు సిద్ధమైన వరి పంట చేతికందే సమయంలో అల్పపీడనంతో రైతులకు భారీ నష్టం చేకూర్చింది. తుంగభద్ర నదితీర ప్రాంతాల్లో వరి పొలాలు నీట మునగడంతో రైతులకు రూ.లక్షల్లో కలిగింది. సంబంధిత అధికారులు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. పత్తికాయలు నల్లబారి కిందకు పడిపోతుండటంతో పగిలిన పత్తి సైతం వర్షానికి తడిసిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వమే పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

బస్సులో రూ.25 లక్షలు చోరీ!

- సికింద్రాబాదు- బెంగుళూరు ప్రయాణంలో అమకతాడు టోల్‌ప్లాజా వద్ద ఘటన
- కర్నూలులో నిందితులను పట్టుకున్న పోలీసులు
- తెల్లవారుజామున హైడ్రామా



నిందితుల (వైట్ టీషర్ట్, రెడ్ షర్ట్)తో పోలీసులు

కర్నూలు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హైదరబాదు నుంచి బెంగుళూరు వెళ్తున్న ఓ ప్రయాణికుడి వద్ద రూ.25లక్షలు చోరీ జరిగిన సంఘటన ఆదివారం జిల్లాలో చోటు చేసుకుంది. అయితే చోరీ జరిగిన రెండు గంటల్లోనే పోలీసులకు డబ్బును రికవరీ చేయగలిగారు. ఈ ఉదంతం జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున కలకలం సృష్టించింది. తెల్లవారుజామున 3 నుంచి 6 గంటల వరకు సుమారు 100 మందికి పైగా పోలీసులు డీస్ జాతీయ రహదారిని జల్లెడపట్టి కేవలం 2 గంటల్లోనే కేసు ఛేదించి సూపర్ అనిపించుకున్నారు. రాజస్థాన్ సిరాయ్ జిల్లాకు చెందిన రావల్ అనే వ్యక్తి గోల్డ్ బిజినెస్ చేస్తుంటాడు. బెంగుళూరులో వెండి బిస్కెట్లు కొనేందుకు రూ.25 లక్షలతో సికింద్రాబాద్‌కు వెళ్లి అక్కడే గుత్తికి చెందిన ధర్మవరం డిపో బస్సును ఎక్కాడు. గుత్తికి వెళ్లి అక్కడి నుంచి గుంతకల్లు చేరుకుని మిత్రుడితో కలసి బెంగుళూరు వెళ్లి వెండి బిస్కెట్లు కొనుగోలు చేయాలని భావించాడు. కర్నూలులో తన సీటు కింద బ్యాగ్ చెక్ చేసుకుంటే.. ఆ బ్యాగ్ సురక్షితంగా ఉంది. వెల్దుర్తి మండలం అమకతాడు టోల్‌ప్లాజా వద్ద ఓ ఇద్దరు యువకులు సడెన్‌గా బస్సు ఆపాలని డ్రైవర్‌ను కోరారు. సికింద్రాబాదు నుంచి అనంతపురం బస్సు టికెట్ తీసుకున్న ఆ ఇద్దరూ మధ్యలోనే దిగడం డ్రైవర్‌ను ఆశ్చర్యపరిచింది. టోల్‌ప్లాజా వద్ద బస్సు ఆపేసి వారిని దింపేశాడు. తీరా టోల్‌ప్లాజా దాటుతుండగా.. సికింద్రాబాదులో బస్సు ఎక్కేటప్పుడు ఖాళీ చేతులతో బస్సు ఎక్కారు. ఇక్కడేమో ఓ బ్యాగుతో బస్సు దిగారనే అనుమానం వచ్చిన డ్రైవర్ వెంటనే బస్సును పక్కకు ఆపి ప్రయాణికులను అప్రమత్తం చేశాడు. అందరూ నిద్రలేపి ఎవరి బ్యాగ్ అయినా పోయిందా అని చూసుకోవాలని కోరారు. అప్పటికి నిద్ర మత్తులో ఉన్న రావల్ తన సీటు కింద ఉన్న బ్యాగ్ మాయమైనట్లుగా గుర్తించి షాక్ అయ్యాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మిగతా 7వ పేజీలో

నింగిలో వెండి మబ్బులు



చాగలమర్రి మండల కేంద్రంలో నీలి మేఘాలు ఆదివారం ఆకట్టుకున్నాయి. సూర్యోదయం సమయంలో ఎత్తైన మేఘాలపై వెండి మబ్బులు చూపరులను కట్టిపడేశాయి. రోజంతా వివిధ ఆకారాల్లో దర్శనమిచ్చాయి. ప్రకృతి గీసిన చిత్రంలా తలపించిన ఈమేఘాలు ఆకాశంలో వెండిమబ్బులు ఆవిష్కృతమై చూపరులను కనువిందు చేశాయి.

● చాగలమర్రి, ఆంధ్రజ్యోతి

జలసోయగం



ప్రకృతిని ఆస్వాదించాలంటే పచ్చని చెట్లు.. కనువిందు జలపాతాలు.. నల్లమలలోని వృక్ష, జంతు సంపదను చూడాల్సిందే. ఆ ప్రకృతిని చూస్తే ప్రతి ఒక్కరూ ఆహ్లాదాన్ని పొందాల్సిందే. అలాంటిదే అవుకు మండలంలోని మంగంపేటతండా సమీపంలోని జలపాతం. ఎడతెరిపి లేని వర్షాలతో కొండల నుంచి వర్షపు నీరు సెలయేర్ల ద్వార ప్రవహిస్తూ ఎత్తయిన కొండల నుంచి జాలువారుతోంది. ఈ మనోహర దృశ్యం ప్రతి ఒక్కరినీ మంత్ర ముగ్ధుల్ని చేస్తోంది. జలపాతం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుం టోంది. మంగంపేట నుంచి జలపాతం వద్దకు చేరుకోవాలంటే మూడు కి.మీ దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. వర్షానికి ఈరహదారి భారీగా కోతలకు గురై గుంతలమయంగా మారింది. అయినప్పటికీ పర్యాటకులు అతి కష్టం మీద జలపాతం వద్దకు చేరుకొని ప్రకృతి సోయగాన్ని తనవి తీరా ఆస్వాదిస్తున్నారు.

● అవుకు, ఆంధ్రజ్యోతి

ప్రైవేటు ట్రావెల్స్‌పై వేశారు..!

- 6 కేసులు నమోదు ● రూ.28,400 జరిమానాలు
- బస్సులవారీగా రికార్డుల పరిశీలన
- ఉలిక్కిపడ్డ ట్రావెల్స్ నిర్వాహకులు



తనిఖీలు చేస్తున్న అధికారులు (ఫైల్)

ఓ దుర్ఘటన అధికారుల్లో చలనాన్ని తీసుకొచ్చింది. నిద్రమత్తును ఇన్నాళ్లకు వీడారు. ఎట్టకేలకు ప్రైవేటు ట్రావెల్స్‌పై కొరడా ఝుళిపిస్తున్నారు. రవాణా శాఖ ఆదేశాల మేరకు దాడులు ముమ్మరం చేశారు. శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున నంద్యాల జిల్లా మీదుగా వెళ్లే ప్రైవేట్ బస్సుల్లో తనిఖీలు చేపట్టారు. ఒకవైపు నిబంధనలు పాటించని బస్సులపై కేసులు.. జరిమానాల రూపంలో కొరడా ఝుళిపించడంతో ఆయా ట్రావెల్స్‌కు చెందిన బస్సుల రికార్డులను పక్కాగా పరిశీలిస్తుండటం గమనార్హం. నిబంధనలు అతిక్రమించి తిరిగే బస్సులపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20 కేసులు నమోదు చేశారు. నంద్యాల జిల్లాలో 6 కేసులు నమోదు చేసి రూ. 28,400 జరిమానాలు విధించారు.

నంద్యాల, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు బస్సు దుర్ఘటన నేపథ్యంలో జిల్లా రవాణాశాఖ అధికారులు ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సులపై విస్తృత దాడులు చేపట్టారు. 6 కేసులు నమోదు చేసి రూ.28,400 జరిమానాలు విధించారు. ఒక్కసారిగా అధికారులు ప్రైవేట్ బస్సులపై ఆకస్మిక దాడులు చేయడంతో ఆయా నిర్వాహకుల్లో అలజడి మొదలైంది. రవాణా శాఖ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు.

జిల్లా రవాణా శాఖ అధికారి శివారెడ్డి నేతృత్వంలో శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున నంద్యాల జిల్లా మీదుగా వెళ్లే ప్రైవేట్ బస్సుల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. రికార్డులు, బస్సుల్లో తగిన భద్రత, అగ్నిమాపక, సీటింగ్ అంశాలవారీగా పరిశీలించారు.

ప్రయాణికులకు అవగాహన

బస్సులో ప్రయాణించే సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే అత్యవసర ద్వారాల నుంచి సురక్షితంగా బయటపడే అంశాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. డ్రైవర్లుకు సైతం డ్రైవింగ్ నిబంధనలు పక్కాగా పాటించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ఆదేశించారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20 కేసులు

రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిబంధనలు అతిక్రమించి తిప్పుతున్న బస్సులపై 361 కేసులు నమోదుచేసి 40బస్సులను సీజ్‌చేశారు. రూ.లక్షల్లో జరిమానాలు విధించారు. కర్నూలు జిల్లాలో 14 కేసులు నమోదుచేసి రూ. 72,050, నంద్యాల జిల్లాలో 6 కేసులు నమోదు చేసి రూ. 28,400 జరిమానా విధించారు.

ఉన్నతాధికారుల ప్రత్యేక దృష్టి

భవిష్యత్తులో కర్నూలు తరహా ఘటనలు పునరావృతం కాకుండా ఆశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో ఏయే బస్సులు ఏరాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ పొందిన తిప్పుతున్నారు? లోకల్ ఎన్ని.. నాన్‌లోకల్ ఎన్ని..? ఇలా పలు అంశాలు వారీగా రవాణా శాఖ అధికారులు ఆరాతీస్తున్నారు. దీంతో ఆయా నిర్వాహ కుల్లో కొంత ఉలికిపాటు మొదలైంది. ఈక్రమంలో తమకు భవిష్యత్తులో ఎలాంటి సమస్య వచ్చి పడుతోందనని ఆందోళన నెలకొంది.

రికార్డులను పక్కాగా పరిశీలిస్తున్నాం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నిబంధనలు పాటించని వాహనాలపై కేసులు నమోదు, జరిమానాలు విధిస్తున్నాం. బస్సుల రికార్డులను పక్కాగా పరిశీలించి నివేదిక తయారు చేస్తున్నాం. ● జి.వి శివారెడ్డి, జిల్లా రవాణా శాఖాధికారి, నంద్యాల



శరవేగంగా..

5వ పేజీ తరువాయి

డీఎన్‌ఏ పరీక్షలకు టాప్ ప్రయారిటీ

ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు డీఎన్‌ఏ పరీక్షలు ఎంతో కీలకమైనవి. సాధారణంగా డీఎన్‌ఏ శాంపిల్స్ పరీక్షలు చేసి నివేదికలు రావడానికి 48 గంటలు లేదా మూడు రోజులు పడుతుంది. ప్రభుత్వం కలెక్టర్, ఎస్పీ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ ఈ పరీక్షలకు టాప్ ప్రియారిటీ ఇచ్చారు. ఆదివారం సెలవు అయినా కూడా పని చేసి 18 మంది మృతదేహాలు, తర్వాత మరో మృతదేహం డీఎన్‌ఏ పరీక్షలు 24 గంటలలోపు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం కలెక్టర్, ఎస్పీ, జేసీ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్, కర్నూలు ఆర్‌డీవో మార్చురీకి చేరుకుని పర్యవేక్షించారు. మృతదేహాలను బంధువులకు అప్పగించే ప్రక్రియ ప్రారంభించారు.

ఫోరెన్సిక్ ప్రొఫెసర్ ఉదయం నుంచే..

కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ విభాగంలో ఆదివారం ఉదయం 8 గంటలకే ఫోరెన్సిక్ విభాగపు ప్రొఫెసర్ డా.బ్రహ్మాజీ మాస్టర్ చేరుకుని ప్రక్రియను ప్రారభించారు. మార్చురీలోని వాకింగ్ కోల్డ్‌రూంలో భద్రపరిచిన 19మృతదేహాలను డా.బ్రహ్మాజీ హాస్పిటల్ డీఎన్‌ఏ రిపోర్టు ఆధారంగా ఒక్కొక్కటి భద్రపరిచి బంధువులకు అప్పగించారు. ఉదయం 8గంటల నుంచి రాత్రి వరకు చాలా వేగంగా పనిచేశారు. ఎలాంటి సమస్య తలెత్తకుండా మృతదేహాలను తరలించారు.



మార్చురీ సమీపంలో హెల్ప్ డెస్క్ ఎదుట మృతుల కుటుంబీకులు

ఇతర రాష్ట్రాల మృతదేహాల కోసం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.వి.వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అంబులెన్సులను తెప్పించారు. కలెక్టర్ సహకారంతో తెలంగాణ నుంచి 9అంబులెన్సులు, కర్నూలు జీజీహెచ్ నుంచి 8 ప్రైవేటు అంబులెన్సులు, 5 మహాప్రస్థానం వాహనాలను రెండు రోజులుగా సిద్ధం చేశారు. మృతదేహాల తరలింపు ఏ మాత్రం ఆలస్యం కాకుండా తరలించారు.



కోల్డ్ స్టోరేజీ రూంలో మృతదేహాల అప్పగింత ప్రక్రియలో పాల్గొన్న డా.బ్రహ్మాజీ మాస్టర్



17 అంబులెన్సులతో తరలింపు

బస్సు అగ్ని ప్రమాదంలో మరణించిన





మార్చురీ సమీపంలో అధికారులతో మాట్లాడుతున్నకలెక్టర్

నేడు కర్నూలులోనే అంత్యక్రియలు?

బస్సు అగ్ని ప్రమాదంలో మరణించిన మృతదేహాల తరలింపు ఆదివారం రాత్రి 8.45 గంటల వరకు కొనసాగింది. 19మృతదేహాల్లో 18 మృతదేహాలను బంధువులకు అప్పగించి వారి స్వస్థలాలకు పంపించారు. ఇక తమిళనాడుకు చెందిన 29 ఏళ్ల ప్రశాంత్ మృతదేహం ఇక్కడే ఉంది. సోమవారం కర్నూలులోనే అంత్యక్రియలు చేస్తామని బంధువులు చెప్పినట్లు తెలిసింది.



మార్చురీ వద్ద మృతదేహాల తరలింపులో పాల్గొన్న అధికారులు

బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ

బస్సు ప్రమాద ఘటనలో మృతి చెందిన తెలంగాణకు చెందిన ఆరు కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.5లక్షల చెక్‌ను ఆప్రభుత్వం తరుపున గద్వాల జిల్లా ఆర్‌డీవో అలివేలు పంపిణీ చేశారు. కర్నూలు జీజీహెచ్‌లోని మార్చురీ వద్ద మృతదేహాల అప్పగింత తర్వాత చెక్‌ను అందించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌కు చెందిన ఆదిశేషగిరిరావు, ఒరిస్సాకు చెందిన దీపక్, చింతల్ హైదరాబాదుకు చెందిన చందన, సంధ్యారాణి, నల్గొండ జిల్లా కోదాడకు చెందిన మేఘనాథ్, యాదాద్రి జిల్లా వాస్సకోదూరు చెందిన మహేశ్వరం అనుషా కుటుంబాలకు చెక్కులు ఇచ్చారు.



బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ

హత్యాయత్నం కేసులో 9మందికి రిమాండ్

నంద్యాల టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జ్ఞానపురానికి చెందిన సుబ్బరాయుడిపై హత్యాయత్నం చేసిన కేసులో ఆదివారం 9మందిని రిమాండుకు తరలించినట్లు టూటౌన్ ఎస్‌ఐ సురేశ్ తెలిపారు. వివరాలు.. రెండు రోజుల కిందట సుబ్బరాయుడిని గుల్లిబాష, మరో ఎనిమిది మంది కలిసి దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

వచ్చేనెల 1నుంచి ఏకాంకిక నాటక పోటీలు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా నవంబరు 1 నుంచి 7 వరకు ఏకాంకిక నాటక పోటీలు ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్ష, కార్యదర్శులు కళారత్న పత్తి ఓబులయ్య, సి.యాగంటీశ్వరప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 'కర్నూలు ఉత్సవ్'కు ఉమ్మడి జిల్లా నుంచి 40 పౌరాణిక ఏకాంకిక నాటకాలు పోటీకి వచ్చాయని పేర్కొన్నారు. మొత్తం 120 మంది కళాకారులు వారం రోజుల పాటూ ప్రదర్శనలు ఇస్తారని వివరించారు. ఉదయం 10 గంటల నుంచీ సాయంత్రం 6గంటల వరకు ఏకాంకిక నాటక పోటీలు, సాయంత్రం 6.30 గంటల నుంచి శాస్త్రీయ, జానపద, పల్లె నృత్యాలు, శాస్త్రీయ, జానపద, పల్లె పాటలు, సంగీత విభావరులు, ఆయా రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు సత్కార కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. 'కర్నూలు ఉత్సవ్-2025' కార్యక్రమాన్ని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ నమోదుకు అంగీకరించిందని తెలిపారు. టీజీవీ కళాక్షేత్రం మూడోసారి తెలుగు బుక్ ఆఫ్ రికార్డుల్లోకి నమోదు కాబోంతోందని వారు పేర్కొన్నారు.

బస్సులో రూ.25 లక్షలు చోరీ!

(5వ పేజీ తరువాయి)

ప్రయాణీకుడు, డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. అప్పటికే కావేరి బస్సు ప్రమాదంపై విచారణలో భాగంగా జాతీయ రహదారిపై పోలీసు గస్తి పెంచారు. వీరిద్దరు ఇచ్చిన సమాచారంతోఅప్పటికే హైవే పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇచ్చారు. మరో పక్క జిల్లా పోలీస్ బాస్‌కు సమాచారం రావడంతో ఎలాగైనా ఈ కేసును వెంటనే ఛేదించాలని ఆదేశించారు. అటు డోన్ వైపు.. ఇటు కర్నూలు వైపు జాతీయ రహదారిలో ఉన్న అన్ని పాయింట్ల వద్ద గస్తి ముమ్మరం చేశారు. కర్నూలులో నైట్ పెట్రోలింగ్‌లో ఉన్న కోడుమూరు సీఐ తబ్రేజ్ తన సిబ్బందితో కలిసి గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న మిస్టర్ ఇడ్లీ హోటల్ వద్ద తనిఖీలు చేపట్టారు. ధర్మవరం ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఆ ఇద్దరు యువకులు బ్యాగ్‌తో ఎర్రబస్సులో ఎక్కారనీ సమాచారం ఇవ్వడంతో ఆ ఎర్రబస్సునే కాకుండా దారిలో వచ్చిన ప్రతివాహనాన్ని తనిఖీలు చేశారు. లారీలు, కార్లు, మోఆటారు సైకిళ్ల ఏదీ వదలిపెట్టలేదు. నాలుగున్నర గంటల నుంచి 6:30 గంటల వరకు సుమారు 200 పైగా వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కర్నూలు వైపు వచ్చిన వాహనాల డ్రైవర్లను ఆరా తీశారు. ఎవరైనా ఇద్దరు యువకులు అమకతాడు టోల్ ప్లాజా వద్ద బస్సు ఆపేందుకు ప్రయత్నించారా? అని ఆరా తీశారు. ఓ ఆర్టీసీ బస్సును ఆపి తనిఖీ చేస్తుండగా.. డ్రైవర్‌ను అడిగారు. మా బస్సులో ఇద్దరు ఎక్కారంటూ డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో వెంటనే అప్రమత్తమైన సీఐ తబ్రేజ్ ముందుగా ఓ ఇద్దరు కానిస్టేబుళ్లను బస్సులోకి పంపాడు. పోలీసుల రాకతో ఆ యువకులు నగదును బయట పడేస్తారేమోనన్న ఉద్దేశంతో డోర్ లాక్ చేసి తాను కిందనే ఉన్నాడు. కానిస్టేబుల్ రాకను గమనించిన ఆ యువకులకు చెమటలు పట్టాయి. ఆ యువకుల వద్ద రూ.25 లక్షల బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని ఇద్దరిని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నగదు మొత్తాన్ని సరి చూసుకుని వెల్దుర్తి పోలీసులకు కేసు అప్పగించారు.



రూ.25 లక్షలను పరిశీలిస్తున్న పోలీసులు

● ఆ ఇద్దరు ఎవరు?

ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహమద్ షాహీద్, సాహెబ్‌గా పోలీసులు గుర్తించారు. వీరిపై గతంలో ఆ రాష్ట్రంలో పలు కేసులు ఉన్నట్లు గుర్తించారు. సికింద్రాబాదు నుంచే వ్యాపారి రావల్‌ను ఫాలో అయినట్లు పోలీసుల విచారణలో తేలింది. రావల్ వద్ద రూ.25 లక్షలు ఉన్న విషయాన్ని ఆ ఇద్దరు యువకులకు ఎవరు చేరవేశారో అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కొంత మంది మార్వాడి వ్యాపారులు తమ తోటి మార్వాడి వ్యాపారులను బిజినెస్‌ను దెబ్బతీసేందుకు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కొంత మంది యువకులను ఎంచుకుంటుంటారనీ పోలీసులు చెబుతున్నారు. అలా ఎవరైనా బిజినెస్ పని మీద దూర ప్రాంతాలకు వెళ్తున్న వారిని పసిగట్టి ఇలాంటి వారికి సమాచారం ఇస్తుంటారనీ సమాచారం. ఆ ఇద్దరు యువకులకు ఎవరు సమాచారం ఇస్తున్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కేవలం 2 గంటల్లోనే పోలీసులు కేసు ఛేదించి దొంగలను పట్టుకున్న పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

తల్లి మందలించిందని.. ఉరేసుకొని యువకుడి బలవన్మరణం

బేతంచెర్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించడంతో ఓ యువకుడు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పట్టణంలోని కోటపేటలో చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు. వివరాలు.. కోటపేటలో నివాసం ఉంటున్న షేక్ నూర్జహాన్ రెండో కుమారుడు హుసేన్‌వలి వ్యసనాలకు బానిసయ్యాడు. శనివారం రాత్రి తల్లి మందలించింది. మనస్తాపానికి గురైన అతడు ఇంట్లోని పైభాగంలో ఉన్న ఓ గదిలోకి నిద్ర పోయేందుకని వెళ్లాడు. అక్కడ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఆదివారం ఉదయం తల్లి వెళ్లి చూడగా కుమారుడు ఫ్యాన్‌కు ఉరేసుకొని విగతజీవిగా మారాడు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోవెలకుంట్లలో వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్పృహ తప్పి పడిపోయి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండల కేంద్రమైన కోవెలకుంట్లలో చోటు చేసుకున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. మండలంలోని బిజినేముల గ్రామానికి చెందిన దస్తగిరి(30) అనే వ్యక్తి ఆదివారం ఉదయం కోవెలకుంట్లకు వచ్చాడు. సుమారు 11.30 గంటల సమయంలో పట్టణంలోని సుశ్మిత ఫర్టిలైజర్స్ షాపు వద్ద ఉన్నట్లుండి స్పృహ తప్పి పడిపోయి మరణించాడు. మృతుడి తల్లి తల్లి నాగలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు

సంజామల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆల్వకొండలో ఇటీవల జరిగిన గొడవల్లో అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఆదివారం ఎస్‌ఐ రమణయ్య తెలిపారు. వివరాలు.. ఈనెల 20న ఆల్వకొండకి చెందిన ఎగ్గోని శ్రీనాథ్ తన స్నేహితుడైన మంగలి సుబ్బయ్యను ఎస్సీ కాలనీలో వదిలిపెట్టడానికి బైక్‌పై వస్తున్నాడు. పేరం శ్రీనివాసరెడ్డి తన ఇంటి ముందు సీసీ రోడ్డుపై సుబ్బయ్య, శ్రీనాథ్‌ను ఆపి కులం పేరుతో నానా దుర్భషలాడాడు. ఇలా ఎందుకు దూషిస్తారని ప్రశ్నించిన శ్రీనాథ్‌ను శ్రీనివాస్‌రెడ్డితో పాటు మరికొందరు మరోసారి దుర్భషలాడి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎల్ఐసీ నిధులను ఉపసంహరించాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసికి చెందిన కోట్లాది మంది ప్రజల పాలసీ డబ్బులు రూ.33 వేల కోట్లను ఆదానికి కట్టబెట్టాలనే ఆలోచనను మోడీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య కూడలిలో జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ అధ్యక్షతన నిరసన తెలిపారు. మోదీ ప్రభుత్వం కార్పొరేటర్లకు ఊడిగం చేయడమే పనిగా పెట్టుకుందన్నారు. ఎల్ఐసీకి చెందిన కోట్లాది మంది పాలసీదారుల నమ్మకాన్ని అదానికి ఆదానికి కట్టబెట్టడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుంటే సీఐటీయూ తీవ్రంగా ప్రజా ఉద్యమం చేసి అడ్డుకుంటుందని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు, నాయకులు పి.నిర్మల, టి.రాముడు, వీరన్న, నారాయణస్వామి, గోపాల్, సీహెచ్.సాయిబాబ తదితరులు పాల్గొన్నారు.

తాగి వాహనం నడిపితే జరిమానా

సి.బెళగల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి నడిపితే వాహనానిన సీజ్ చేయడతోపాటు జరమాన విధిస్తామని ఎస్ఐ పరమేష్‌నాయక్ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. యువత ద్విచక్ర వాహలను ఇష్టం వచ్చినట్లు నడిపి రోడ్డు ప్రమాదాలకు కారమణమవుతున్నారన్నారు. ఈ తనిఖీల్లో రూ.5,648లు జరిమాన విదించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో హెడ్ కనిస్టేబుల్ ఆచారి, శ్రీనువాసులు ఉన్నారు.

అశోకా ఇంజనీరింగ్ కళాశాల సీఈవోకు అవార్డు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అశోకా మహిళా ఇంజనీరింగ్ కళాశాల సీఈవో డా.హరీష్ కృష్ణ ద్రోణాచార్య అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని టి-హబ్‌లో నిర్వహించిన ప్రతిష్టాత్మక కోహర్ట్ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో టీసీఎస్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ బాల ప్రసాద్, ఐకార్ జాయింట్ డైరెక్టర్ డా.కల్పనా శాస్త్రి చేతుల మీదుగా అందజేశారు. కర్నూలు విద్యారంగంలో కొత్త దిశగా ఆవిష్కరణలు, నూతన ఆలోచనలు అమలు చేస్తూ విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించడంలో కృషి చేసినందుకు అంద జేశారు. యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్నహరీష్ కృష్ణ

'కళలు, కళాకారులకు ప్రోత్సాహకాలు'



కళాకారులకు పారితోషికం అందజేస్తున్న పత్తి ఓబులయ్య, తదితరులు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టీజీవీ కళాక్షేత్రం ద్వారా కళలు, కళాకారులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో గుంటూరుకు చెందిన ఆరాధన ఆర్ట్ అకాడమీ నాటక సంస్థ ఆధ్వర్యంలో 'పాప దొరికింది' హాస్య నాటిక ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో పత్తి ఓబులయ్య జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ కళాక్షేత్రంలో అనునిత్యం కళారంగానికి చెందిన విభిన్న ప్రదర్శనలు నిర్వహిస్తూ కళాకారులకు వేదిక కల్పిస్తున్నామని చెప్పారు. నాటిక నిర్వాహకులకు రూ.20వేలు నగదు పారితోషికంతోపాటూ శాలువలు, పూల దండలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ మేనేజర్ చిన్నరాముడు, కళాక్షేత్రం పూర్వ అధ్యక్షుడు పి.దస్తగిరి, కార్యదర్శి సి.యాగంటీశ్వరప్ప, ఇతర ప్రతినిధులు మహ్మద్ మియా, పి.రాజారత్నం, సంగా ఆంజనేయులు, కేవీ రమణ, ఎస్‌డీ క్రిష్టఫర్, కేవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన హాస్య నాటిక

గుంటూరుకు చెందిన ఆరాధన ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో టీజీవీ కళాక్షేత్రంలో ప్రదర్శించిన 'పాప దొరికింది' హాస్య నాటిక ఆసాంతం ప్రేక్షకులను అలరింపజేసింది. నాటక రచయిత గోవింద రాజుల నాగేశ్వరరావు రచించిన ఈ నాటికకు నడింపల్లి వెంకటేశ్వరరావు దర్శకత్వం వహించారు. ఇందులో నాగరాణి, హసీనా, వెంకటేశ్వరరావు, రవీంద్రబాబు, సాంబశివరావు, డాక్టర్ బాబు, అనిల్ చౌదరి వివిధ పాత్రలో అలరించారు.

ఆశల సాగు..

● శనగ విత్తుతున్న రైతులు ● ఇప్పటికే సబ్సిడీ విత్తనాలు అందించిన ప్రభుత్వం

ముందస్తు వర్షాలతో ఊరించిన ఖరీఫ్ పంటలు రైతులను నిరాశపరిచాయి. అధిక వర్షాలతో దాదాపు పంటలన్నీ దెబ్బతిన్నాయి. దీంతో రైతులు రబీలో శనగ సాగుకు సిద్ధమయ్యారు. ఓర్వకల్లు మండలంలో 4,500 ఎకరాల్లో చేస్తున్నారు.



ఓర్వకల్లులో శనగ విత్తుతున్న రైతు

ఓర్వకల్లు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులు శనగ సాగుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేసింది. మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, పూడిచెర్ల, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, గుట్టపాడు, ఎన్.కొంతలపాడు, హుశేనాపురం, శకునాల, తిప్పాయపల్లె గ్రామాల్లో రైతులు విత్తనాలు వేస్తున్నారు.

ముంచిన ఖరీఫ్ పంటలు..

ఇప్పటికే ఖరీఫ్‌లో అధిక వర్షాలతో పత్తి, మొక్కజొన్న, ఉల్లి, టమోటా, పెసర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తాము తీవ్రంగా నష్టపోయాయని శనగ సాగుతోనైనా కోలుకోవాలని రైతులు ఆశిస్తున్నారు. ప్రభుత్వం 100 సబ్సిడీతో విత్తనాలు ఇచ్చి ఉంటే బాగుండేదని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

విత్తనాలు పంపిణీ చేసిన ప్రభుత్వం

ప్రభుత్వం 25 శాతం సబ్సిడీతో రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేస్తోంది. ఈ ఏడాది వర్షాలు బాగా కురవడంతో పొలాల్లో పదును ఉంది. ఇక ఆలస్యం లేకుండా విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధమయ్యారు.

పదెకరాల్లో సాగు చేస్తున్నా



పదెకరాలను గుత్తకు తీసుకుని శనగ సాగుచేస్తున్నా. మండలంలో ఈ ఏడాది రబీలో శనగ సాగు విస్తీర్ణం పెరిగింది. ఖరీఫ్ పంటలు నష్టం తేవడంతో శనగ ఆదుకుంటుందని ఆశిస్తున్నాం.

- రోళ్లపాడు, మద్దిలేటి, రైతు, ఓర్వకల్లు

రైతులందరికీ విత్తనాలు ఇస్తున్నాం



రైతులందరికీ శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్నాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సమీప రైతు సేవా కేంద్రంలో ప్రశాంతంగా సబ్సిడీ విత్తనాలను తీసుకెళ్లవచ్చు.

- మధుమతి, ఏవో, ఓర్వకల్లు.

సారా తయారీ, విక్రయం మానుకున్నవారికి పునరావాసం

● నేడు కలెక్టర్ చేతుల మీదుగా ఆటోలు, పరిహారం పంపిణీ

కర్నూలు అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సారా తయారీ, విక్రయాలు మానుకున్న వారికి జిల్లా యంత్రాంగం పునరావాసం, ఉపాధి అవకాశాలను కల్పిస్తోందని ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ సోమవారం కలెక్టర్ చేతుల మీదుగా నగరంలోని బంగారు పేటకు చెందిన 5 కుటుంబాలకు ఆటోలను పంపిణీ చేయనున్నామని, మరో 5 మందికి చెక్కులను ఇవ్వనున్నామ న్నారు. కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 176 మంది సారా తయారి, విక్రదారులకు గుర్తించామన్నారు. సారా మానుకున్న వారికి ఉపాధి చూపుతామని పిలుపు నివ్వడంతో 55 మంది వరకు దూరంగా ఉన్నట్లు గుర్తించి ఎక్సైజ్ సూపంరింటెండెంట్ సుధీర్ బాబు కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారన్నారు. ఈ మేరకు మొదటి దశలో 10 మందికి పరిహారం ఇవ్వనున్నట్లు తెలిపారు. నవోదయం 2.0లో భాగంగా సారా రహిత సమాజాన్ని చూడాలని ప్రభుత్వం పిలుపు నిచ్చిందన్నారు.

అవకాశాలను వినియోగించుకోవాలి

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు అంది వచ్చిన అవకాశాలను వినియోగిచుకోవాలని డ్రాగన్‌బోట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మంచికంటి అవినాశ్ శెట్టి సూచించారు. ఆదివారం గార్గేయపురం నగరవనం చెరువులో రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళలు, పురుషుల అండర్-23 విభాగంలో డ్రాగన్‌బోట్ ఎంపిక పోటీలు నిర్వహిం చారు. ప్రతిభచూపిన వారు నవంబరు 24 నుంచి 27 వరకు మహారాష్ట్ర నాందేడ్‌లో నిర్వహించనున్న 12వ జాతీయ పోటీల్లో రాష్ట్రం తరుపున పాల్గొంటారన్నారు. జిల్లా యోగా సంఘం కార్యదర్శి మునిస్వామి, డీఎస్ఏ వాటర్ స్పోర్ట్స్ శిక్షకుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు



డ్రాగన్ బోట్ పోటీల్లో క్రీడాకారులు

నాలుగో తరగతి ఉద్యోగుల కార్యవర్గం

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖ ఉమ్మడి జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం గుత్తి పెట్రోలు బంకు సమీపంలోని కార్యాలయంలో ఎన్నికల అధికారులుగా దేవరపల్లి జగన్నాథం, జెట్టిపోయిన మదుబాబు వ్యవహరించారు. రాష్ట్ర అధ్యక్షుడు రావులపాటి శ్రీనివాసరావు, బాపట్ల గోపాల కృష్ణయ్య నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎస్.గోపీ, ఉపాధ్యక్షులు ఎస్.మార్కేండే యులు, బి.మోహన్‌రావు. ప్రధాన కార్యదర్శి బి.నాగాంజనేయులు, టి.శరత్, బి.అన్నాజీరావు, కోశాధికారి ఎస్.దూద్‌బాబు వలిని ఎన్నుకున్నారు.



ఎంపికైన సభ్యులు

జానీ బాషాకు కలాం నేషనల్ అవార్డు

కర్నూలు అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సాయిక్రిష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ జానీ బాషాకు డా.ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ ప్రతిభా అవార్డు-2025 ప్రదానం చేశారు. ఆదివారం గుంటూరులో సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నాగయ్య, టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వహిద్ హుస్సేన్ అవార్డు అందచేశారు.



అవార్డు అందజేస్తున్న ప్రతినిధులు

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని డీఈవో శామ్యూల్ పాల్ అన్నారు. ఆదివారం టౌన్ మోడల్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో పదవీ విరమణ పొందిన హెచ్‌ఎంలు, ఎంఈవోలను సన్మానించారు. శ్రీనివాస్ యాదవ్, నారాయణ, రమేష్, ఆదాంబాషా, విశ్రాంత డిప్యూటీ ఈవో హనుమంతరావు పాల్గొన్నారు.



విశ్రాంత ఉద్యోగులతో డీఈవో శామ్యూల్ పాల్

'భగవద్గీత సారాన్ని గ్రహించాలి'

కర్నూలు కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత సారాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నగర కమిటీ అధ్యక్షుడు నాగయ్య అన్నారు. ఆదివారం నగరంలోని బాలాజీనగర్ ఆచార్య ప్రబోధానంద రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలపై జ్ఞాన ప్రచారం నిర్వహించారు. ఇందూ జ్ఞాన వేదిక ప్రతినిధులు కల్యాణ్ రామవన్, వెంకటేశ్, మధువాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజలు లిఖిత పూర్వకంగా తెలియచేయాలన్నారు. సమస్యకు గడువులోపు పరిష్కారం లభిస్తుందని, పరిష్కార స్థితిని https:// meekosam.ap.gov.inlZ అనే వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చన్నారు.

ఎర్రమట్టి తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తాం

సి.బెళగల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలం నుంచి అను మతి లేకుండా ఎర్రమట్టి తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తామని తహసీల్దార్ వెంకటలక్ష్మి హెచ్చరించారు. ఆదివారం మాట్లాడుతూ బ్రాహ్మణ దొడ్డి, సిబెళగల్, మారందొడ్డి, పోలకల్లు, సంగాల, చింతమానుపల్లె, క్రిష్ణదొడ్డి, గొల్లల దొడ్డి గ్రామాల్లో నిఘా ఉంచామన్నారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదికకు మండల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

కర్నూలు క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వేరు వేరు కారణాలతో ఇరువురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాల మేరకు.. ఉల్చాలకు చెందిన పద్మావతి (41) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమె భర్త వెంకటేశ్వర్లు ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వీరు మూడు నెలలుగా కల్లూరులోని సుంకులమ్మ వీదిలో నివాసం ఉంటున్నారు. వెంకటేశ్వర్లు తమ్ముడు శ్రీనివాసులుతో కొన్నేళ్లుగా పొలం విషయాల్లో తగాదాలు ఉన్నాయి. మనస్తాపానికి గురై ఆమె ఉరి వేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన శ్రీనివాసులు పెళ్లి కావడంలేదని ఉరి వేసుకున్నాడు. ఇతడు ఓ వాహన డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వివాహం కాకపోవడంతో మనస్తాపానికి గురై ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉరివేసు కోగా, కుటుంబ సభ్యులు, స్థానికులు పోలీ సులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీల్లో చేర్చాలి

కర్నూలు అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆరెకటికలను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, టీడీపీ నాయకుడు క్రిష్టోజీరావు డిమాండ్ చేశారు. ఆదివారం మాట్లాడుతూ కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ కటిక ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తున్నామన్నారు.

మెరిట్ విద్యార్థులకు వైద్య విద్య దూరం



కోటి సంతకాల సేకరణలో పాల్గొన్న కాటసాని

కల్లూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వైద్య కళాశాలలను పీపీపీకి అప్పగించడంతో ప్రతిభ గల విద్యార్థులకు వైద్య విద్యను దూరం అవుతుందదని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం 34వ వార్డులో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ-కోటి సంతకాల సేకరణలో పాల్గొన్నారు. రాష్ట్రంలో వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం కానివ్వమని, ప్రజల మద్దతులో ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతామన్నారు. వైద్యవిద్యను కార్పొరేట్‌కు కట్టబెట్టి వైద్యవిద్యను కష్టతరం చేయాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు.



రాజ్‌విహార్ వద్ద ర్యాలీలో పాల్గొన్న వైద్యులు

రొమ్ము క్యాన్సర్‌ను నివారిద్దాం

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అవగాహనతో రొమ్ము క్యాన్సర్‌ను నివారిద్దామని అమీలియో ఆసుపత్రి ఎండీ డా.సి.లక్ష్మిప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రపంచ రొమ్ము క్యాన్సర్ మాసోత్సవాల సందర్భంగా ఆదివారం ఉదయం సిబ్బంది ర్యాలీని నిర్వహించారు. నగరంలోని బళ్లారి చౌరస్తా నుంచి కొత్తబస్టాండు మీదుగా రాజ్‌విహార్‌కు చేరుకున్నారు. డా.లక్ష్మి ప్రసాద్ మెడికల్ అంకాలజిస్టు డా.రేవతి, రేడియేషన్ అంకాలజిస్టు డా.లక్ష్మి నివాస్ మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్ మాసోత్సవాలను సందర్భంగా మహిళలకు ఉచిత మామోగ్రఫీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించి చికిత్స చేయించుకోవాలన్నారు.

సహాయక చర్యలకు సిబ్బంది

కల్లూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావ ప్రాంతాల్లో సేవలందించేందుకు బృందాలను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ ఎస్ఈ ఆర్.ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఆదివారం విద్యుత్ భవన్ వద్ద వాహనాలను ప్రారంభించారు. సిబ్బంది, ఇంజనీర్లతో మొత్తం 180 మందిని పంపుతున్నట్లు తెలిపారు.

1న తిరుమలకు యాత్ర

కల్లూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నవంబరు 1 పాతబస్టాండ్ చెన్నకేశవస్వామి ఆలయం నుంచి తిరుమలకు మహాపాదయాత్ర నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు పాలూరి శివయ్య, పియూ మాదన్న తెలిపారు. ఆదివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కాల్వబుగ్గ, బేతంచెర్ల, బనగానపల్లె, నొస్సం, జమ్ములమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప, రాజంపేట, రైల్వేకోడూరు, తిరుచానూరు, తిరుపతి, తిరుమల మీదుగా పాదయాత్ర ఉంటుందన్నారు.

16న గృహాల కేటాయింపు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జగన్నాథగట్టు వద్ద టిడ్కో గృహాలను లబ్దిదారులకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. మంత్రులు టీజీ భరత్, నారాయణ ఆదేశాలు అమలు చేస్తున్నామన్నారు. నవంబర్ 16న లబ్దిదారులకు 976 ఇళ్లను కేటాయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సిబ్బంది సమస్యలను తీర్చాలని ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీవీ సాయికుమార్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఇటీవల జేడీగా పదోన్నతి పొందిన పీఎల్ వరలక్ష్మిని సన్మానించారు. రవి ప్రకాష్, కాశన్న, మహేంద్ర, రమేష్, టైపిస్టు, స్టెనోగ్రాఫర్ల ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, నాగ కిషోర్, పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ



బెల్టులు ప్రదానం చేస్తున్న డా.వాసురెడ్డి

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ వస్తుందని డా.పి.వాసురెడ్డి అన్నారు. ఆదివారం కొండారెడ్డి బురుజు కేఎంసీ పార్కులో తైక్వాండో మార్షల్స్ ఆర్ట్స్‌కు బెల్టు టెస్టు గ్రేడింగ్ నిర్వహించి, వివిధ రకాల బెల్టు ప్రదానం చేశారు. కోచ్ టి.వెంకటేశ్వర్లు, అజయ్ తేజ పాల్గొన్నారు.

● మార్షల్ ఆర్ట్స్‌తో వికాసం అలవరుతుందని ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. ఆదివారం కొత్తబస్టాండు వద్ద కరాటే గ్రేడింగ్‌లో పాల్గొన్నారు. మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ప్రతినిధి షకీల్, ప్రైవేటు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కొండెపోగు చిన్న సుంకన్న, కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.

పన్నులు కడుతున్నా అభివృద్ధి సున్నా..

● బి.తాండ్రపాడు గ్రామం శిఖామణినగర్ కాలనీ దుస్థితి ● సీసీ రోడ్లు, డ్రైనేజీ లేక ప్రజల అవస్థలు




సీసీ రోడ్లు, డ్రైనేజీ లేని కాలనీ

కర్నూలు రూరల్ అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): మండలం బి.తాండ్రపాడు గ్రామం అభివృద్ధికి దూరంగా ఉంది. కర్నూలు నగరానికి పక్కనే ఉన్నా కనీస సౌకర్యాలు లేవు. గ్రామంలోని ఆటోస్టాండ్ మొదటిలైన్ శిఖామణి నగర్‌లో కనీస సౌకర్యాలు లేవు. 2005లో శిఖామణినగర్ ఏర్పడింది. నాటి ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో పేదల ఇళ్లు నిర్మించుకున్నారు. కాలనీలో దాదాపు వంద కుటుం బాలు ఉన్నాయి. బి.తాండ్రపాడుతో పాటు సమీపంలోని ప్రజానగర్ కాలనీ కలిపి మొత్తం 7,800 మంది ఓటర్లు ఉండగా, 16వేల మంది నివసిస్తున్నారు.

రోడ్లు, కాలువలు లేక అవస్థలు

కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ లేదు. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నిత్య మురుగు మధ్యలోనే నివసించాల్సి వస్తోందని దుర్వాసనతో అల్లాడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న వర్షం కురిసినా కాలనీ చిత్తడిగా మారుతోంది. అలాగే కాలనీలోని పశ్చిమంలో ఉన్న గృహ ఆల నుంచి మురుగు వచ్చి రోడ్డుపై పారుతోంది. కాలనీ ఏర్పడి 20ఏళ్లు అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు.

పంచాయతీకి భారీగా ఆదాయం..

తాము గ్రామ పంచాయతీకి ఇంటిపన్ను, కొళాయి పన్నులను క్రమం తప్పక చెల్లిస్తున్నామని ప్రజలు అంటున్నారు. కర్నూలుకు సమీపంలోనే ఉండటంతో బి.తాండ్రపాడు భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. గ్రామం చుట్టు పక్కల ఇప్పటికే అనేక వెంచర్లు, గృహనిర్మాణాలు ఉన్నాయి. వాటినుంచి స్టాంపు డ్యూటీ అలాగే విద్యాసంస్థల పన్నులు కూడా పంచాయతీకి వస్తోంది. ఇంత ఆదాయం ఉన్నా అభివృద్ధి మాత్రం చేయడం లేదు.

దోమల బెడదతో అల్లాడుతున్నాం



కాలనీ ఏర్పడి 20ఏళ్లు అయింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. కాలనీ వాసులంతా పంచాయతీ కార్యద ర్శికి దృష్టికి తీసుకెళ్లిన స్పందన లేదు. డ్రైనేజీ లేక మురుగు ఇళ్లముందు వుం టోంది. దోమల బెడద తీవ్రంగా వుంది. సీజనల్ వ్యాధులు ప్రబలి ఇబ్బంది పడుతున్నాం. **-నసీమ, కాలనీవాసి**

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటాం

● మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి

ఆదోని టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కాలువలపై అక్రమ కట్టడాల నిర్మాణంతో చిన్నపాటి వర్షానికి కూడా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఉన్నాయని మునిసిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ 7వ వార్డు ఖనీ మొహల్లాలో మంజూరు అయిన అభివృద్ధి పనులకు జరిగిన భూమి పూజ సందర్భంలో అక్రమ కట్టడాలు అడ్డంకిగా మారిన పరిస్థితిని గమనించామన్నారు.. పట్టణంలోని అనేక ప్రాంతాలలో కాలువలపై అక్రమ కట్టడాలు నిర్మించిన కారణంగా వర్షాకాలంలో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అక్రమ కట్టడాల కారణంగా విశాలంగా ఉండే కాలువలు కుదించుకొని పోయి వర్షాకాలంలో వరద నీరు సక్రమంగా పారే వీలు లేక రోడ్లపైకి చేరుకుంటుందని అన్నారు. ప్రతి వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అక్రమ కట్టడాలను వాటి యజమానులే స్వయంగా తొలగించుకోవాలని, లేనిపక్షంలో అధికారులతో తొలగిస్తామని హెచ్చరించారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు


సీఐ పులిశేఖర్

తుగ్గలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపి వారి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన తుగ్గలిలో ఆయన మాట్లాడుతూ వాహనదారులు నిర్లక్ష్యంగా వాహనాలను నడపడంతో పాటు డ్రైవింగ్ సరిగ్గారాని వారు వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయనీ డ్రైవింగ్ లైసెన్సు, అన్ని అనుమతులు ఉన్న వాహనాలనే నడపాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల చిన్నటేకూరు వద్ద బస్సు ప్రమాద సంఘటనలే జరుగుతాయని, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే అంత పెద్ద ప్రమాదం జరిగిందని, ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా చర్యలు పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకోవాలన్నారు.

స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి

ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి


మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న వైకుంఠం జ్యోతి

ఆలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. ఆదివారం సాయంత్రం అక్షిత చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో రూ.14 వేలు విలువ చేసే కుట్టు మిషన్లను సబ్సిడీ ధరతో రూ.6700కు పంపిణీ చేశారు. ఇంట్లోనే ఉండి కుట్టు మిషన్ ద్వారా డబ్బులు సంపాదించుకోవచ్చన్నారు. అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళలకు సబ్సిడీపై కుట్టు మిషన్లు ఇచ్చేందుకు ముందుకొచ్చిన అక్షిత చారిటబుల్ ట్రస్ట్‌ను ఆమె అభినందించారు.

ఇంటి వద్దకే రేషన్..

వృద్ధులకు, దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా కూటమి ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేస్తుందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. ఆదివారం ఆలూరు పట్టణంలోని ఇందిరానగర్‌లో ఇంటింటికి వెళ్లి నిత్యావసరాలు పంపిణీ చేశారు. డీలర్లు సక్రమంగా రేషన్ సరఫరా చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బసవన్నగౌడ్, జనసేన నాయకులు రంజిత్, డీలర్లు వన్నూరు, ప్రతాప్, మున్నా, టీడీపీ నాయకులు కొమ్ము రాజు, అతిథి హోటల్ షేక్ష, రమేష్, కిట్టు, కిషోర్, మసాల జగన్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొంథా తుఫాన్ ప్రభావం వల్ల వర్షాలు పడతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ గూండాల్ నాయక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బురుజుల, సుద్దబాయి వంక ప్రవహించే సమయంలో ప్రజలు వాగును దాటవద్దని తెలిపారు. పాతమిద్దెల్లో నివాసం ఉండకూడదన్నారు. పాతమిద్దెలో ఉండేవారు ప్రత్యామ్నాయ చూసుకోవాలన్నారు. వర్షాలు అధికంగా ఉండంటతో పాతమిద్దెలు కూలడం, ప్రమాదం వంటివి పొంచి ఉంటాయన్నారు. విద్యుత్ స్థంభాలను తాకవద్దని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

తుగ్గలి: నేటి నుంచి వచ్చే మొంథా తుపాన్‌తో ప్రజలు అప్రమత్తంగా జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్ రవి సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బంగాళాకాతంలో ఏర్పడే అల్పపీడనం వల్ల కురిసే తుపాన్‌తో నేడు, రేపు రెండు రోజుల పాటు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దన్నారు. వర్ష సూచనలు ఉన్నప్పుడు పొలాలకు వెళ్లిన రైతులు వెంటనే ఇళ్లకు చేరుకోవాలన్నారు అలాగే పంట నూర్పిడీలు ఏవైనా ఉంటే రెండు రోజులు ఆగి నూర్పిడి చేసుకోవాలన్నారు.

28న వైసీపీ ర్యాలీ

మద్దికెర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను నిరసిస్తూ ఈ నెల 28న పత్తికొండలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జడ్పీటీసీ సభ్యులు మురళీధర్ రెడ్డి, మండల వైసీపీ అధ్యక్షులు కృష్ణాయాదవ్, ఉప సర్పంచ్ కవిరెడ్డి కృష్ణ పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు అన్నారు. ఆదివారం మద్దికెరలో వైసీపీ నాయకులు పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు వెంకటేశ్వర్లు, గంధం చంద్ర, అశోక్ రెడ్డి, రామకృష్ణ, రామాంజులు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అశ్రద్ధ వహిస్తే చర్యలు

వెల్దుర్తి, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యాన్ని అశ్రద్ధ చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి బాస్కర్ హెచ్చరించారు. ఆదివారం జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి ఎల్. భాస్కర్, జిల్లా మలేరియా అధికారి నూకరాజుతో కలసి వెల్దుర్తి గ్రామాన్ని సందర్శించారు. ప్రభుత్వాసుపత్రి, గ్రామంలో వార్డులను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై శ్రద్ధ వహించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. డాక్టర్ భువన తేజ, వెంకటేశ్వర్లు, మోహన్ పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి కృషి చేయాలి


వ్యాయామ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడల అభివృద్ధికి కొత్తగా బాధ్యతలు చేపట్టిన వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదోని మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు, పెద్దకడబూరు మండల విద్యాశాఖ అధికారి రామ్మూర్తి పేర్కొన్నారు. ఆదివారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఇటీవల డీఎస్సీలో ఎంపికై వ్యాయామ ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన వారిని 60 మందిని, జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న గరిజ రామన్నను ఏపీపీఈటీ, ఎస్‌ఏపీఈ అసోసియేషన్ ఆదోని జోన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ వెనుకబడిన పశ్చిమ ప్రాంత గ్రామాల ప్రభుత్వ పాఠశాలలో ఎంతో మంది నైపుణ్యత కలిగిన క్రీడాకారులు ఉన్నారని వారిని గుర్తించి క్రీడల్లో ప్రోత్సహిస్తే మంచి క్రీడాకారులుగా ఎదుగుతారన్నారు. ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రోత్సహిస్తుందనడానికి నిదర్శనం కొత్తగా ఎంపికైన వ్యాయామ ఉపాధ్యాయులే అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జోసెఫ్ లక్ష్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చందు నాయక్ కోశాధికారి శ్రీనివాసులు, ఆదోని జోన్ అధ్యక్ష కార్యదర్శులు నరసింహారాజు, నరసింహులు, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ నరసయ్య, ఈరన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు టెట్ నిబంధన తీసేయాలి

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : 2010 ఏడాదికి ముందు నియామకం అయిన ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష రాయాలన్న నిబంధనను ప్రభుత్వం విరమించుకోవాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు వై ముత్తన్న కోరారు. ఆదివారం ఏపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. అన్ని పరీక్షలు రాసి ఉపాధ్యాయ పోస్ట్ సాధిస్తే మళ్లీ టెట్ పరీక్ష పాస్ కావాలని ప్రభుత్వం చెప్పడం మంచిది కాదన్నారు. మల్లికార్జున, శ్రీనివాసులు, రాఘవేంద్ర, తిక్కస్వామి, భాస్కర్, భీమ్ రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలు ఇవ్వాలి

మద్దికెర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎడతెరపి లేని వర్షాలు పడటం వల్ల రైతులు సాగు చేసిన పంటలైన ఉల్లి, ఉలువ పూర్తిగా కుళ్లిపోయాయనీ, రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు ఉచితంగా రాయితీ విత్తనాలు మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, శాఖ కార్యదర్శులు పెరవలి సుధాకర్ కోరారు. నెల రోజుల నుంచి వివిధ తుపాన్ల ప్రభావం వల్ల రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా తడిసి కుళ్లిపోయాయన్నారు. ప్రత్యాన్మయ పంటలుసాగు చేసుకునేందుకు ప్రభుత్వం విత్తనాలు ఇవ్వాలని కోరారు.

వర్షాకాలంలో విద్యుత్‌తో జాగ్రత్త

తుగ్గలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో రైతులు, విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ ఏడీ సుజాత అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో పొలాల్లో మోటార్లు ఆన్ చేసే సమయంలో చేతికి గ్లౌజులు వేసుకోవడం, లేదా ఒట్టి కట్టెతో మోటార్లు ఆన్ చేసుకోవాలన్నారు. విద్యుత్ స్థంభాలను ఎట్టి పరిస్థితుల్లో తాకరాదన్నారు. విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే విద్యుత్ అధికారులకు తెలియజేయాలన్నారు. ఎస్సీలు, ఎస్టీలు 100 యూనిట్లు దాటితే రూ.1000లు కరెంటు బిల్లు చెల్లించాల్సి వస్తుందని, హీటర్లు వినియోగించరాదన్నారు.

చంద్రబాబుతోనే బీసీలకు సముచిత స్థానం


మాట్లాడుతున్న కురుబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప

ఆలూరు రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితోనే బీసీలకు సముచిత స్థానం ఉంటుందని రాష్ట్ర కురుబ-కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల సంక్షేమం కోసం అభ్యున్నతికి సీఎం చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేస్తున్నాడన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించి అనేక పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం నిరంతరం కృషి చేస్తున్నాడన్నారు. సమావేశంలో కురువ సంఘం తాలూకా నాయకులు బెలగంటి హనుమప్ప, యండిహళ్లి సర్పంచ్ సుధాకర్, హాలహర్వి బీజేపీ అధ్యక్షుడు నిట్రవట్టి బసప్ప తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థాపక దినోత్సవాన్ని జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న క్రిష్ణయ్య

పత్తికొండ టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈనెల 31వ తేదీన జరిగే ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి క్రిష్ణయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సి.ఆర్.భవన్‌లో ఏఐటీయూసీ నియోజకవర్గ సమావేశం నెట్టికంటి అధ్యక్షతన జరిగింది. ఈనెల 31వ తేదీన ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పెద్ద ఎత్తున జరుపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కారుమంచి, ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రంగన్న, గౌరవాధ్యక్షులు మాదన్న, నాయకులు ఉప్పర ఉచ్చన్న, నాగరాజు, శీను, విజయ్, లక్ష్మీదేవమ్మ పాల్గొన్నారు.

జంగమల అభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న జంగమ సంఘం జిల్లా అధ్యక్షుడు

ఆదోని టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జంగమ సామాజిక వర్గం రాజకీయంగా, సామాజికంగా ఎంతో వెనుకబడిందని, వారిలో చైతన్యం తీసుకొని రావడానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర జంగమ మహేశ్వర సంక్షేమ సంఘంకు నూతన కార్యదర్శిగా ఎంపికైన ఆదోనికు చెందిన మహర్షి విజయ్ కుమార్ స్వామి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ట్రస్ట్ బోర్డులో సభ్యత్వం హక్కు ఉండి సాధించుకోలేకపోవడం విచారకరమని అన్నారు. కొత్త కార్యవర్గంలో రాష్ట్ర అధ్యక్షుడిగా జేపీ మల్లికార్జున స్వామి, కార్యదర్శులుగా రుద్రయ్య, మహర్షి విజయ్ కుమార్, గౌరవాధ్యక్షుడు చెన్న బసవయ్య స్వామి, నాగేశ్వరరావు, చంద్రయ్య, ఉపాధ్యక్షులుగా నటరాజ్ స్వామి, బండయ్య స్వామి తదితరులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారని తెలిపారు.

ఘనంగా ఈరన్నతాత స్వామి కలశ ప్రతిష్ఠ


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఆలూరు రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలగవల్లి గ్రామంలో వెలిసిన తిక్క ఈరన్నస్వామి దేవాలయంలో ఆదివారం నూతన గోపురం కలశ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి గణపతిపూజ, రుద్రాభిషేకం, గంగిపూజ, నవగ్రహ పూజ, గోపూజను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

వాషింగ్ మెషిన్ల పంపిణీ


వాషింగ్ మెషిన్‌లు అందిస్తున్న రజక సంఘం నాయకులు

మద్దికెర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లోని 62 మంది రజకులకు కేంద్ర ప్రభుత్వం వాషిన్ మిషన్‌లు మంజూరు చేసిందని మండల రజక సంఘం నాయకులు చిరంజీవి తెలిపారు. ఆదివారం మద్దికెర గ్రామంలో రజకులకు వాషిన్‌మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద మంజూరు చేసిందని తెలిపారు. రజకులకు వాషిన్‌మిషన్లు ఇవ్వడం వల్ల బట్టలు ఉతకడానికి సులభతరం అవుతుందని తెలిపారు. రజక వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రజకులకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహాన్ని అందించాలని కోరారు. రజక సంఘం నాయకులు ఉన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం


రాజు (ఫైల్)

చిప్పగిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గుంతకల్ మండలం కసాపురం వద్ద గల్లంతైన చిప్పగిరి మండలం రామదుర్గం గ్రామానికి చెందిన రాజు(26) అనే యువకుడి మృతదేహం ఉరవకొండ మండలం రాగులపాడు వద్ద హంద్రీ కాలువలో లభ్యమయ్యింది. గుంతకల్ మండలం బుగ్గ సంగాల దేవాలయంలో పెళ్లికి వెళ్లిన రాజు కసాపురం వద్ద కాలువలో నీళ్లు తాగడానికి వెళ్లి జారి పడ్డాడు. తోటిమిత్రులు రాజును రక్షించడానికి ప్రయతినంచగా కాలువలో మునిగిపోయాడు. రామదుర్గం గ్రామస్తులు శనివారం సాయంత్రం దాకా వెతికినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం రాగులపాడు వద్ద శవాన్ని చూసిన స్థానికులు... పోలీసులకు సమాచారం అందించారు. వారు శవాన్ని వెలికితీసి బంధువులకు సమాచారం అందించారు. చిప్పగిరి మండలం రామదుర్గం గ్రామానికి చెందిన రాజుది పేద కుటుంబం. తల్లిదండ్రులు పద్మావతి, ఏలీయాస్ వ్యవసాయ కూలీలు. ఈరికి నలుగురు సంతానం. ఇద్దరు ఆడ పిల్లలకు పెళ్లి చేశారు. హరిప్రసాద్, రాజు మగ సంతానం. రాజు తండ్రి ఏలియాస్ కూలీ పనికి వెళ్లి చెట్టు కొమ్మును కోస్తూ చెట్టుపై నుంచి కింద పడి మృతిచెందాడు. కుమారుడు రాజు కాలువలో పడి మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాధం నెలకొంది. రాజు కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని సర్పంచ్ రోహిణి, గ్రామస్థులు కోరారు.

ఎరుపు వస్త్రమే హెచ్చరిక బోర్డు ..!


ప్రమాద హెచ్చరిక కింద కట్టెకు ఎరుపు వస్త్రాన్ని కట్టిన దృశ్యం

మద్దికెర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మద్దికెర నుంచి వయా బురుజుల పత్తికొండకు వెళ్లే రహదారి బురుజుల వద్ద గల పెద్దహుల్తి వంక బ్రిడ్జి వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతుండటంతో గ్రామంలో చెందిన యువకులు రహదారి రోడ్డు పక్కన ఒక కట్టె పెట్టి దానికి ఎరుపు రంగు కలిగిన వస్త్రాన్ని కట్టి హెచ్చరిక సూచినను ఏర్పాటు చేశారు. కల్వర్టు ఇరువైపులా ప్రహరి లేకపోవడం వల్ల గత కొన్ని నెలల క్రిందట ప్రమాదవశాత్తు ఓ వీఆర్వో కూడా మృతి చెందాడు. అంతేగాక ఎక్కువ శాతం వాహనాలులు ప్రమాదాలు జరుగుతుండటంతో స్థానికులు ఇరువైపులా ఓ కర్రకు ఎరుపు వస్త్రాన్ని ఉంచి సూచిక ఏర్పాటు చేశారు. దీనిని కొద్ది దూరంలో గమనిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవని వాహనదారులు అభిప్రాయ పడుతున్నారు. అయితే.. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.





రోడ్లు ఇలా.. వెళ్లేదెలా?

అడుగుకో గుంత ● ఇబ్బంది పడుతున్న వాహనదారులు

వారం రోజుల నుంచి ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గ్రామీణ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. అడుగుకో గుంత ఏర్పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలన్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నందవరం, కోసిగి మండలాల్లో రోడ్లు దారుణంగా తయరయ్యాయి.

నరకానికి నకళ్లు నందవరం రోడ్లు



చెరువును తలపిస్తున్న ముగతి రోడ్డు

నందవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నందవరం రోడ్లు నరకానికి నకళ్లుగా మారాయి. చినుకు పడితే రహదారులన్నీ చిత్తడిగా మారుతున్నాయి. వాహనదారులు, పాదాచారులు ప్రయాణించేందుకు జంకుతున్నారు. కనీసం గతుకుల రోడ్లుకు అతుకులు వేసే నాథుడు కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. పలువురు ప్రమాదాలకు గురవుతున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి విజయ్‌నరేష్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు రెండు సార్లు ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. ఎమ్మెల్యే మళ్లీ పంపమన్నారు. 400 మీటర్లకు గాను రూ. 60 లక్షలు నివేదికలు తయారు చేసి ప్రతిపాదనలు పంపామన్నారు.



నందవరం ఎమ్మిగనూరుకు వెళ్లే రోడ్డు ఇలా..

గుంతల రోడ్లతో అవస్థలెన్నో..



దుద్ది గ్రామంలో ప్రధాన రోడ్డుపై పడిన గుంతలు

కోసిగి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని దుద్ది గ్రామంలోని సాతనూరు-చిర్తనకల్ ప్రధాన రోడ్డుపై గుంతలు పడ్డాయి. దాంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. 2021లో రూ. 2.22కోట్లతో సాతనూరు నుంచి దుద్ది వరకు కొట్టాల, చిర్తనకల్ మీదుగా 9.65 కిలోమీటర్ల తారు రోడ్డును వేశారు. అయితే దుద్ది గ్రామం నుంచి సుమారు కిలోమీటరు వరకు సీసీ రోడ్డు వేయాల్సి ఉన్నది. కానీ, అప్పటి కాంట్రాక్టరుకు గతంలో వైసీపీ నాయకులు పర్సేంటేజీ విషయంలో తేడాలు రావడంతో రోడ్డు వేయకుండా వదిలేసినట్లు గ్రామస్థులు తెలిపారు. వర్షం నీరు గుంతల్లో చేరడంతో కుంటలను తలపిస్తున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలువురు ప్రమాదాల బారిన పడి గాయాలపాలయ్యారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గుంతలు పడిన రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

మొంథా తుఫాన్‌పై ముందస్తు చర్యలు



మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో అనంతశయన

గోనెగండ్ల, అక్టోబరు 26(ఆంధ్ర జ్యోతి): ముంచుకొస్తున్న మొంథా తుఫాన్ కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకుగాను అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. పునరావస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ ఎంపీడీవో అనంతశయన, కార్యదర్శి సతీష్, గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి తెలిపారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గాజులదిన్నె ప్రాజెక్టు లో నీటి మట్టం 376.70 మీటర్లు ఉందని, జీడీపీ అధికారులు హంద్రీనదికి నీటి విడుదల చేస్తున్నారని పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



మాధవరంలో మృతదేహానికి నివాళి అర్పిస్తున్న రఘునాథ్ రెడ్డి

మంత్రాలయం, అక్టోబరు 26 (ఆంధ్ర జ్యోతి): బాధిత కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని టీడీపీ సీనియర్ నాయకుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త కురువ ముక్కరప్ప అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రఘునాథ్‌రెడ్డి గ్రామంలో మృతదేహానికి నివాళి అర్పించారు. మృతుడి కుమారులు బొజ్జప్ప, నాగరాజు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేశన్న, విజయ్ కుమార్,గూర్కింటి భీమిరెడ్డి,నాగరాజు,ఈడిగ రాఘప్ప తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆలయ హుండీ లెక్కింపు

కౌతాళం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించనున్నట్లు ఈవో వాణి తెలిపారు. ఆదివారం దేవస్థానపు కార్యాలయంలో ఈవో విలేకరులతో మాట్లాడుతూ స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకలను ఆలయ ప్రాంగణలో లెక్కిస్తామన్నారు.

సిబ్బంది నుంచి రక్షణ కల్పించాలి

కౌతాళం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయం సిబ్బంది వేధింపుల నుంచి తనకు రక్షణ కల్పించాలని పాఠశాలలో స్కావెంజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మి కోరారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ స్కావెంజర్‌గా విధులు నిర్వహిస్తున్న తనను ఎస్‌వో, వ్యాయమ ఉపాధ్యాయురాలు, వంట సిబ్బంది మనోవేదనకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఈటీ సమీప బంధువుకు స్కావెంజర్ పోస్టు రాకపోవడంతో తనను ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. గతంలో ఎంఈవో శోభారాణికి ఫిర్యాదు చేయడంతో వేధింపులు అధికమయ్యాయని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తెలుగుయువత నాయకుడి మృతి



రామాంజనేయులు (ఫైల్)

ఎమ్మిగనూరు,అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 17వ వార్డు టీడీపీ మాజీ కౌన్సిలర్ లక్ష్మి, వార్డు ఇన్‌చార్జి జయన్న కుమారుడు బోయ రామాంజనేయులు ఆదివారం మృతి చెందాడు. రెండు రోజుల క్రితం రామాంజనేయులు అనారోగ్యానికి గురికావటంతో కర్నూలులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి మాజీ కౌన్సిలర్ లక్ష్మి జయన్నతో ఫోన్‌లో మాట్లాడి సంతాపం తెలిపారు. నాయకులు బాస్కర్ల చంద్రశేఖర్, కౌన్సిలర్ రామదాసు గౌడ్, మిఠాయి నరసింహులు, మాచాని మహేష్, నరసప్ప, మహేంద్ర బాబు సంతాపం తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరు,అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వేరుశనగ, ఆముదం ఉత్పత్తులకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం వ్యవసాయ మార్కెట్ కమిటీలో స్థానిక నాయకుడు హనుమంతు ఆధ్వర్యంలో వేరుశనగ, ఆముదం రైతులతో మాట్లాడారు. మార్కెట్‌లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించాలన్నారు. అధిక వర్షాతో రైతులు పంట నష్టపోయినా ఎమ్మెల్యే రైతుల వద్దకు రాలేదున్నారు. ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మార్కెట్‌కు భారీగా ఆముదాలు

ఎమ్మిగనూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్‌కు ఆదివారం భారీగా ఆముదాలను విక్రయానికి తీసుకొచ్చారు. దాదాపు 160 మంది రైతులు 1,745 బస్తాలు(873 క్వింటాళ్లు) మార్కెట్‌కు తరలించారు. గరిష్ట ధర రూ.5,890లు కాగా మధ్యస్థం రూ.5,680లు, కనిష్టం రూ.5,009లు పలికింది. వేరుశనగ 739బస్తాలు(222 క్వింటాళ్లు) వచ్చాయి. గరిష్ట ధర రూ.5,900లు కాగా కనిష్ట ధర రూ. 2760లు పలికింది.

జిల్లా సదస్సును జయప్రదం చేయండి

ఈనెల 28న ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతుసంఘం నిర్వహించనున్న పత్తి రైతుల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు రూ. 10వేలు కనీస మద్దతు ధర ఇవ్వాలని, ఉచిత పంటల బీమా అమలు చేయాలని కోరారు.

ఏజెంట్ల చేతివాటం..

● టెండర్ ధరపై అధికంగా వసూలు



ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగ విత్తనాల కోసం వచ్చిన రైతులు

ఎమ్మిగనూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌యార్డులో కమీషన్ ఏజెంట్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దీంతో రైతులు ఏజెంట్ల తీరుపై మండిపడుతున్నారు. ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, కోసిగి, కౌతాళం మండలాలతో పాటు ఆయా ప్రాంతాల్లో రబీ సీజన్‌లో వేరుశనగ పంటను రైతులు అధికంగా సాగు చేస్తారు. అయితే ఆశించిన స్థాయిలో విత్తనాలు లభించడం లేదు. ఆయా మండలాల రైతులు వేరుశనగ విత్తనం కోసం ఆదివారం ఎమ్మిగనూరు మార్కెట్‌కు వచ్చారు. మార్కెట్‌కు వేరుశనగ తక్కువగా రావటంతో కొనుగోలు చేసేందుకు రైతులు పోటీ పడ్డాల్సి వచ్చింది. దీన్ని అదునుగా తీసుకున్న కొంతమంది కమీషన్ ఏజెంట్లు చేతివాటం ప్రదర్శించారు. బయ్యర్లు వేసిన టెండర్ ధర కన్న అధికంగా ధర చెల్లిస్తేనే ఇస్తామని చెప్పటంతో రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వాస్తవంగా ఆదివారం ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగ గరిష్ట ధర రూ. 5900లు పలకగా మరి కొన్ని లాట్లు రూ. 5700, 5650లు పలికాయి. అయితే కమీషన్ ఏజెంట్లు మాత్రం క్వింటానికి రూ.300 నుంచి 500లు వరకు అధికంగా ధర చెల్లిస్తే ఇస్తామని చెప్పటంతో గత్యంతరం లేక కొంతమంది కొనుగోలు చేయగా, మరి కొంతమంది వెనుతిరిగారు. ప్రభుత్వం నుంచి సరఫరా లేకపోవటం వల్లే వ్యాపారులు ఆటలు సాగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధిక ధర చెల్లించాలంటున్నారు



నాకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. ఇప్పటికే ఎకర పొలంలో వేరుశనగ వేశాను. మిగిలిన ఎకరన్నరలో వేరుశన వేసేందుకు విత్తనం కోసం మార్కెట్‌కు వచ్చాను. అయితే ఇక్కడ వ్యాపారులు రాసిన టెండర్ ధర కన్న అధికంగా ఇవ్వాలని అంటున్నారు. వ్యాపారులు రాసిన ధరకు ఇవ్వాలని అడిగితే లేదంటున్నారు.

● కోసిగయ్య, రైతు, కోసిగి

రూ. 6వేలు చెబుతున్నారు



మాకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. వేరుశనగ పంట వేసేందుకు నాలుగు క్వింటాళ్ల బుడ్డలు అవసరం. కొందామని మార్కెట్‌కు వచ్చా. అయితే ఇక్కడేమో టెండర్‌లో ధర రూ. 5700 అయితే రూ. 6వేలకు అయితే ఇస్తామంటున్నారు. ఏమి చేయాలో అర్థం కావటం లేదు.

● మాంతేష్, హాల్వీ, కౌతాళం మండలం

ప్రైవేటీకణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణకు శ్రీకారం చూట్టినట్లు పట్టణ వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు లతారెడ్డి తెలిపారు. ఆదివారం 29వ వార్డులో ఇన్‌చార్జి బుట్టా రేణుక అధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. వైద్యం, విద్య ప్రభుత్వ బాధ్యత అని, ప్రభుత్వ ఆస్తులను కాపాడుకొవడం మన బాధ్యతగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

● వైసీపీ నాయకుడిపై కేసు నమోదు

కోసిగి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిర్తనకల్ గ్రామంలో అదనపు కట్నం కోసం వేధింపుల కేసు నమోదైంది. గ్రామానికి చెందిన పాటిల్ మహాలక్ష్మిని ఆమెభర్త పాటిల్ సూర్యనారాయణ, అత్త, మామాలు పాటిల్ ఆంజనేయ, పాటిల్ కొండమ్మ, హుశేనమ్మలు అదనపు కట్నం తేవాలని నిత్యం వేధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారనీ, ఐదు నెలల క్రితం భర్త పాటిల్ సూర్యనారాయణ రెండో పెళ్లి చేసుకుని తనకు అన్యాయం చేశాడనీ బాదితురాలు పాటిల్ మహాలక్ష్మి.. ఎస్‌ఐ హనుమంతరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దొంగతనం కేసులో బంగారు రికవరీ

కోసిగి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6వ తేదీన కోసిగిలోని ఉరుకుంద మెయిన్ రోడ్డులో ఉన్న జొల్లు లీలావతి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాలాలు పగులకొట్టి బీరువాలో ఉన్న బంగారం, వెండి నగదును దోచుకెళ్లారు. బాధితురాలు లీలావతి పిర్యాదు మేరకు ఎస్‌ఐ హనుమంతరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఆదివారం కేసులో కర్ణాటక రాష్ట్రం రాయచూరు చెందిన అంజనేయ, పరుశురాం నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 25 గ్రాముల బంగారం, 20 తులాల వెండి, రూ.6,300 నగదును స్వాదీనం చేసుకుని దొంగతనానికి ఉపయోగించిన పల్సర్‌ను స్వాదీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని సీఐ మంజునాథ్, ఎస్‌ఐ హనుమంతరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మంజునాథ్ మాట్లాడుతూ దొంగతనం కేసును సీసీ పుటేజీ ఆదారంగా త్వరితగతిన చేదించి ప్రతిభ కనబరిచిన ఎస్‌ఐ హనుమంతరెడ్డిని, హెడ్ కానిస్టేబుల్స్ నజీర్, శ్రీనివాసులను, కానిస్టేబుళ్ల శ్రీనివాసులు, లక్ష్మినారాయణలను సీఐ మంజునాథ్ అభినందించారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వైసీపీ హయాంలోనే నకిలీ మద్యం

● టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



మాధవరం మద్యం దుకాణం వద్ద సురక్ష యాప్‌ను చూపిస్తున్న నాయకులు

మంత్రాలయం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం గత వైసీపీ హయాంలోనే ఏరులై ఎరిందని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి ఆరోపించారు. ఆదివారం మాధవరం గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్ఎం గోపాల్‌రెడ్డ జిల్లా అధికార ప్రతినిధి చావడి సురక్ష అనే యాప్‌న్ యాప్‌ను ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వం జె.బ్రాండ్ పేరుతో నకిలీ మద్యాన్ని విక్రయించిందని, వేలమంది ప్రాణాలు పోచినా పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు అసత్య ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు సీఎం చంద్రబాబు కల్తీ మద్యానికి చెక్‌పెట్టడానికి మొబైల్ యాప్‌ను తీసుకొచ్చారన్నారు. వెంకటేష్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, మడివాల రాఘవేంద్ర, వడ్ల విజయ్‌కుమార్, చంద్ర, లక్ష్మయ్య, శివ, ఉసేని తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

ఎమ్మిగనూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వీరశైవ లింగాయత్ విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని సంఘం అధ్యక్ష కార్యదర్శులు రాచోటప్ప, మామిడి మల్లికార్జున ఆదివారం ప్రకటనలో కోరారు. 2025లో పది, ఇంటర్ 90శాతం మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎమ్మిగనూరు పట్టణంలోని వీరశైవసంఘం కార్యాలయంలో ఆధార్‌కార్డు, మార్కుల జాబితా, ఫొటోతో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9440293342, 9848892777, 9885490992 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



రాఘవేంద్ర కాలనీ నిరసన తెలుపుతున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గోవిందు డిమాండ్ చేశారు. ఆదివారం సంజీవనగర్, రాఘవేంద్ర కాలనీ, దామోదర్ సంజీవయ్య కాలనీల్లో పర్యటించారు. రాఘవేంద్ర కాలనీ ఏర్పడి 20 సంవత్సరాలూనా తాగునీటి సమస్య ఉందన్నారు. కాలనీవాసులతో కలిసి పలుమార్లు మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించి, వినతి పత్రాలు ఇచ్చినా, కమిషనర్ నిమ్మకు నిరెత్తినట్లు ఉన్నారని ఆరోపించారు. పేరుకే గ్రేడ్ -1 మున్సిపాలిటీ అని అభివృద్ధి మాత్రం శూన్యమన్నారు. అబ్దుల్లా, రమేష్, సురేష్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

నూతన క్యూ కాంప్లెక్స్ ఏర్పాటు



క్యూ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు

మంత్రాలయం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం నూతన క్యూ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేశారు. పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో గురుపాదసేవ ఇన్‌చార్జి అధికారి హరినాథ్ సూచనలతో మఠం ఈఈ సురేష్‌కోణాపూర్, ఏఈలు బద్రినాథ్, శ్రీహరిలు దగ్గరుండి క్యూలైన్లు ఏర్పాటుచేశారు. దీనికి కల్పతరు క్యూ కాంప్లెక్స్‌గా నామకరణంచేశారు. దాదాపు రూ.40లక్షల ఖర్చుతో రంగసభంగణ (మ్యూజియం)న దివైపున ఉన్న ఖాలీ స్థలాన్ని విశాలంగా క్యూలైన్లు, మరుగుదొడ్లు, తాగునీరు, సేద తీరేందుకు బెంచ్‌లు, ఫ్యాన్లతో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆదివారం పరిశీలించి భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఒకేసారి 1500 మంది భక్తులు క్యూలైన్‌లో ఉండే విధంగా తీర్చి దిద్దడంతో భక్తులు వ్యక్తం చేస్తున్నారు. ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషి, శ్రీపతి ఆచార్ పనులు పూర్తిచేయించారు. ఈపరిశీలనలో ఐపీ నరసింహమూర్తి, అనంతపురాణిక్, జేపీ స్వామి, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్ఆచార్, రవికులకర్ణి, తంబిస్వామి, వాజేంద్రాచార్ పాల్గొన్నారు.

స్వర్ణ పల్లకిలో రాఘవేంద్రులు

వేద పండితుల మంత్రోచ్ఛారణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్ర స్వామి స్వర్ణ పల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం కార్తీక చవితి పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి



చెక్క రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

● రాఘవేంద్ర స్వామి మఠంలో ప్రహ్లాదరాయలు చెక్క రథంపై విహరించారు. కార్తిక ఆదివారం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెక్క రథంను పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛారణాలు, మంగళ వాయిద్యాల మధ్య పూజలు నిర్వహించారు.

మఠానికి రూ.4 లక్షల విరాళం

రాఘవేంద్రస్వామి మఠానికి ఆదివారం భక్తులు రూ.4లక్షలు విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్, శ్రీపతి ఆచార్, ఐపీనరసింహస్వామి తెలిపారు. కృష్ణా జిల్లా నర్సరావు పల్లె భక్తుడు కోటేశ్వర రావు అన్నదానానికి రూ.2లక్షలు, బెంగుళూరుకు చెందిన ఇద్దరు భక్తులు విక్రమ్ శ్వాతసేవకు రూ.లక్ష ఇవ్వగా మరో భక్తులు కార్తిక్ రూ.50వేలు అన్నదానం, రాయచూరు భక్తుడు రూ.50వేలు ఇచ్చారన్నారు. వీరు కుటుంబ సమేతంగా వేర్వేరు సమయాల్లో రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని విరాళాలు ఇచ్చినట్లు తెలిపారు. దాతల కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.



యాగశాలలో మహాగణపతి హోమం నిర్వహిస్తున్న పండితులు

ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు.

● శ్రీమఠం యాగశాలలో ఆదివారం మహాగణపతి హోమం నిర్వహించారు. పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బెంగుళూరుకు చెందిన అతిరుద్ర మహాయజ్ఞ సమితి ఆధ్వర్యంలో వేదబ్రహ్మశ్రీ సత్యనారాయణ శాస్త్రి, చిదంబరం, బాలగంజి, శ్రీరాజగోపాల్ గణపాటి, కృష్ణమూర్తి భాయిరి సమక్షంలో హోమగుండంలోకి ధూపదీప, నైవేద్యాలు, సుగంధ ద్రవ్యాలు వేస్తూ నిర్వహించారు. సమితి అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం జోయిస్, రమేష్ తో పాటు 40మంది పండితులతో యాగశాల మారుమ్రోగింది. ఏఏఓ మాధవశెట్టి ,మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచర్, సురేష్ కోణాపూర్, ఐపీనరసింహమూర్తి, అనంతపురాణిక్, జేపీస్వామి, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్ఆచార్, రవికులకర్ణి,తంబిస్వామి, వాజేంద్రాచార్ పాల్గొన్నారు.